నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, మార్చి 5: షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించడం కోసం ప్రతి నెలా ఈ డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డయల్ యువర్ డీఎం సెల్ నంబర్ 9959226287 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.

11న సర్వసభ్య సమావేశం

యాచారం, మార్చి5: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల11న మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం10.30గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరవ్వాలన్నారు.

ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా అప్సర్

కడ్తాల్, మార్చి 5 : తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ నాల్గొవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలోని గృహకల్పన భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో పశుసంవర్ధక శాఖలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న అప్సర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు.

సీఐగా బాధ్యతలు స్వీకరణ

ఆమనగల్లు : ఆమనగల్లు సీఐగా బి.ప్రమోద్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన విజయ్‌కుమార్ మల్టీజోన్-2 హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐని ఎస్ఐ బాల్‌రామ్ నాయక్ శాలువాతో సన్మానించారు.

వైద్యసిబ్బంది మెరుగైన సేవలందించాలి

ప్రభుత్వ దవాఖానలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

- నియోజకవర్గంలో వందశాతం పల్స్‌పోలియో
- జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్, మార్చి 5: ప్రభుత్వ దవాఖానలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ అన్నారు. మంగళవారం మండలంలో నిర్వహిస్తున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానను పరిశీలించారు. చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాల పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం వందశాతం పూర్తైందన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. షాబాద్, చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు స్వచ్ఛంద సంస్థ సహకారంతో నూతన హంగులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అందుకనుగుణంగా దవాఖానకు వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో మహిళల సాధారణ కాన్పులు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ వరలక్ష్మి, శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తొద్దు

- ఎంపీపీ కృపేశ్

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్, మార్చి 5 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ సూచించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కృపేశ్ అధ్యక్షతన జరిగింది. ముందుగా వేసవి ఆరంభమైనందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని దండుమైలారం ఎంపీటీసీలు అరుణమ్మ, అనసూయ, తుర్కగూడ, కప్పాడు గ్రామాల ఎంపీటీసీ భరత్‌రెడ్డి సభా దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా అధికారులు చూడాలని వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు సభ్యులు కోరారు. గ్రామాల్లో బెల్టుషాపులను అరికట్టాలన్నారు. రైతులు ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించేలా చొరవ చూపాలని ప్రజాప్రతినిధులను పశువైద్యాధికారి సురేశ్‌బాబు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటమ్మ, తహసీల్దార్ సునీత, ఏపీడీ సక్రి యా నాయక్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి, ఎంపీటీసీలు, ఆయాశాఖల అధికారులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజ

కడ్తాల్, మార్చి 5 : తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల గ్రామంలో మంగళవారం ఇరుముడిధారణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. పరమశివుడికి అభిషేకాలు, మంగళహారతులు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహాపడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ రూ.5 వేలు అందజేశారు. అనంతరం స్వాములు శ్రీశైలం దేవస్థానానికి బయల్దేరారు. కార్యక్రమంలో స్వాములు బాలస్వామి, జంగయ్య, నారాయణ, రమేశ్, బాలకృష్ణ, నర్సింహ, మహేందర్‌గౌడ్, రామకృష్ణ, మహేశ్, దినేశ్, శివ, అభినవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరం

విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు స్నేహలతారెడ్డి, కిరణ్మయి

ఆమనగల్లు, మార్చి 5: మండల కేంద్రంలోని లెనోరా ప్రైడ్ హైస్కూల్ ఆధ్వర్యంలో ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం జేజే డెంటల్ దవాఖాన సహకారంతో డాక్టర్లు స్నేహలతారెడ్డి, కిరణ్మయి ఆధ్వర్యంలో ఉచితంగా దంత పరీక్ష లు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ లలిత్ కృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ అస్రఫ్ అచారత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేవెళ్ల ట్రాఫిక్ సీఐగా వెంకటేశ్

చేవెళ్లటౌన్, మార్చి 5: చేవెళ్ల ట్రాఫిక్ నూతన సీఐగా వెంకటేశ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన సైదులు కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చందానగర్ పోలీస్ స్టేషన్‌లో డీఐ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న వెంకటేశ్ చేవెళ్లకు బదిలీ అయ్యారు.

ఫార్మాసిటీ సీఐగా నర్సింహారావు

ఫార్మాసిటీ సీఐ నరసింహారావు

యాచారం, మార్చి 5 : మేడిపల్లి గ్రామంలోని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ నూతన సీఐగా నరసింహారావు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ నాగరాజు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్, మార్చి 5: మరో కాశీ శైవ క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన ఉత్తర రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే శంకర్ దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంపత్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

దేవాలయ భూమిని ఆక్రమిస్తే చర్యలు

ఆరుట్లలో దేవాలయ భూమిలో బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

మంచాల, మార్చి 5 : దేవాలయ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్వేత అన్నారు. మండలంలోని ఆరుట్ల గ్రామంలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయానికి సంబంధించిన భూమి సర్వే నంబర్ 1581, 82లో 12 ఎకరాల 26 గుంటల భూమిని గ్రామానికి చెందిన కొందరు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించారని కలెక్టర్, తహసీల్దార్‌కు గ్రామస్తులు రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన రెవెన్యూ అధికారులు మంగళవారం ఆలయ భూమిని గుర్తించి అట్టి భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ జంగయ్య గౌడ్, గ్రామస్తులు యాదయ్య, మార సురేశ్, రాజు, భాస్కర్, అంతటి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చేవెళ్లరూరల్: బీరప్ప ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న అత్తెల్లి అనంత్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, మార్చి 5 : మండలంలోని దామరగిద్ద గ్రామంలో నిర్మించనున్న బీరప్ప ఆలయ నిర్మాణానికి దాతలు చేయూతనిస్తున్నారు. మంగళవారం అత్తెల్లి అనంత్‌రెడ్డి ఆలయ నిర్మాణానికి రూ.51 వేలను ఆలయ సభ్యులకు అందజేశారు.

చేవెళ్లటౌన్ : చేవెళ్లలో మండంలోని ఆలూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఆయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్నారు. చేవెళ్ల గ్రామానికి చెందిన అతేల్లి అనంతరెడ్డి మంగళవారం రూ.51 వేలను ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం

యాదమ్మకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం, మార్చి 5: మండలంలోని చింతపట్ల గ్రామానికి చెందిన కోలుగురు యాదమ్మ అనే నిరుపేద ఒంటరి మహిళకు భారత్ సేవా సహకార్ ఫోరం అండగా నిలిచింది. బీఎస్ఎస్ఎఫ్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ యాదమ్మ ఇంటి నిర్మాణానికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు సాబేర్ బసవరాజ్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో యాదమ్మ కష్టాలను గుర్తించి స్పందించిన ఆయన ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో సుధాకర్‌శర్మ, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులున్నారు.

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

ఆమనగల్లు, మార్చి 5 : పట్టణంలోని శివాలయ నగర్ కాలనీలోని పురాతన శివాలయంలో ఈ నెల 8న శివరాత్రి సందర్భంగా నిర్వహించే శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవ ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. శివరాత్రి రోజున ఉదయం 5 గంటల నుంచి రుద్రాభిషేకం, అర్చనలు ప్రారంభమవుతాయని, రాత్రి 7 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్, చెక్కల లక్ష్మణ్, కండె భాస్కర్, గాజుల తిరుపతయ్య, పున్న వెంకటేశ్, నవీన్, గాజుల రమేశ్, రాఘవేందర్, కండె సుమన్, సాయి, శత్రు, సృజన, భాగ్యమ్మ, విజయ, పూజారులు చెరుకు శివకుమార్, అక్షయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మొయినాబాద్, మార్చి 5 : విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్ఎస్ ఆటోమొబైల్ సీఈవో శ్రీమాన్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్విక్టా-2024 పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి సంస్కృతి, క్రీడా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని సుమారుగా 50 కళాశాలల నుంచి విద్యార్థులు ఇన్విక్టా కార్యక్రమంలో పాల్గొన్నారు. డాన్స్, సంగీతం, నాటకం ఛాయాచిత్రం వంటి కలలను ప్రదర్శించారు. బాస్కెట్ బాల్, వాలీ బాల్, కబడ్డీ, త్రో బాల్ వంటి అవుట్ డోర్ గేమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ గేమ్స్ ఆడారు. సంస్కృతి, క్రీడా కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మొయినాబాద్ ఎస్ఐ కిషన్‌జీ, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్స్య, డీఎస్ఏ హెడ్ ఉదయశ్రీ, ఫిజికల్ డైరెక్టర్లు కావేరి, సాంకేత్, సోపర్ట్స్ కన్వీనర్లు వినయ్‌సాయి, సాయిచరణ్, కల్చర్ కన్వీనర్లు శాంతిసిద్దినేని, పడిషాల, ఆకాశ్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

కడ్తాల్ : కొండ్రిగానిబోడు తండాలో ఆవుకు గాలికుంటు నివారణ టీకా ఇస్తున్న మండల పశువైద్యాధికారి భానూనాయక్

మంచాల :కాగజ్‌ఘట్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి సుధ

కడ్తాల్, మార్చి 5 : పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి భానూనాయక్ అన్నారు. మంగళవారం కడ్తాల్, కొండ్రిగానిబోడుతండా, రావిచేడ్, ముద్విన్, చల్లంపల్లి, కర్కల్‌పహాడ్ గ్రామాల్లోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో 648 ఆవులు, 22 బర్రెలకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేవీవోలు రాజేశ్, మల్లేశ్, వెంకటయ్య, వీఏలు రమేశ్, బురాన్, చంద్రశేఖర్, సంజీవ్, వాల్యా, గోపాల మిత్రులు శ్రీశైలం, నవీన్, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

మంచాల : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ సుధ అన్నారు. కాగజ్‌ఘట్ గ్రామంలో పశువులకు గాలి కుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రాంచందర్, శ్రీశైలం, శివరాజు, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

కామినేని డాక్టర్ కావ్యకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

మన్సూరాబాద్, మార్చి 5: ఎల్బీనగర్ కామినేని దవాఖానలో కన్సల్టెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ దెందులూరి కావ్యకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. అతి పిన్న వయస్సు 31 సంవత్సరాల 9 నెలల్లోనే ఎంబీబీఎస్, ఎండీ, డీఎంతో పాటు కాలేయ వ్యాధులు, కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సల్లో పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్ పూర్తి చేశారు. భారతదేశంలోనే కాలేయ విభాగంలో ఇంత తక్కువ వయస్సులో కోర్సులను పూర్తి చేసినందుకు గాను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖనలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ దెందులూరి కావ్య వివరాలు వెల్లడించారు.

వేదాద్రి లక్ష్మీనృసింహ్మస్వామి బ్రహ్మోత్సవాలు షురూ

కడ్తాల్, మార్చి 5: తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో వెలసిన వేదాద్రి లక్ష్మీనృసింహ్మస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం ఆలయంలో నర్సింహులు అయ్యగారు, శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో గణపతిపూజ, మహాభిషేకం, లక్షపుష్పార్చన, గణపతి హోమం, మూలతంత్ర హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పోలియో చుక్కలు

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారిణి రాజ్యలక్ష్మి

యాచారం, మార్చి 5: పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ 0-5సంవత్సరాల లోపు 187 మంది చిన్నారులకు డాక్టర్ రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో పోలియో చుక్కలు వేశారు. వైద్యులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్క ర్లు, ఆశవర్కర్లు, దవాఖాన సిబ్బంది బస్టాండ్, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులకు చుక్కలు వేశారు. మొత్తం 5846 మంది చిన్నారులకు చుక్కలను వేశారు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా బలదేవరెడ్డి

తుర్కయాంజాల్, మార్చి 5 : తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా మున్సిపాలిటీ పరిధి కొహెడకు చెందిన కందాళ బలదేవరెడ్డి నియమితులయ్యారు.ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ బలదేవరెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్,ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పరీక్షప్యాడ్లు, స్టేషనరీ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 5 : పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని యునైటెడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు పరీక్షప్యాడ్లు, ఇతర స్టేషనరీని అందజేశారు. కార్యక్రమంలో యూనైటెడ్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు సింహాద్రిరెడ్డి, సాయిరామ్, కిరణ్‌రెడ్డి, శంకర్, స్వామి, రాజేందర్, కృష్ణ తదితరులున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విజేతలు, నిర్వాహకులతో ప్రజాప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 5: క్రీడలతో పోటీతత్వం పెరుగడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రజాప్రతినిధులు అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో కుత్బుల్లాపూర్ ప్రీమియర్ లీగ్-4 (క్యూపీఎల్) ముగిసింది. విజేతగా చంద్రశేఖర్ ఆజాద్ ఫైటర్స్, రన్నరప్‌గా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పాన్‌థర్స్ నిలిచారు. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు వీరస్వామియాదవ్, రవీందర్‌గౌడ్, నిరంజన్, నిర్వాహకులు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణం సీజ్

చౌకధర దుకాణాన్ని సీజ్ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్

ఆమనగల్లు, మార్చి 5 : ఆమనగల్లులో చౌకధరల దుకాణాల్లో మంగళవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీలు నిర్వహించింది. 1వ నంబర్ చౌకధరల దుకాణంలో పరిమాణంలో వ్యత్యాసం ఉన్న కారణంగా దుకాణాన్ని సీజ్ చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ తెలిపారు.